క్లుప్తంగా

23న మండల సర్వసభ్య సమావేశం

వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ముక్కపాటి కోటేశ్వరరావు అలియాస్ కోటయ్య (45) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా ప్రభుత్వ పరంగా రూ. లక్ష రూపాయలు బీమా పథకంలో వర్తించగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు నగదు మృతుడి భార్యకు సర్పంచ్ తన్నీరు భారతి చేతుల మీదగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి డి.రవీంద్ర, వేల్ఫేర్ సహాయకులు వెంకట్రావు ఉన్నారు.

రేపు నీలంపాటి అమ్మవారి తిరునాళ్లు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల ఈనెల 19న ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ మద్దినేని హరిబాబు శుక్రవారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా దేవాలయాన్ని సుందరంగా అలంకరించినట్లు ఆయన వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు జిరాక్స్ మిషన్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు రూ.40 వేల విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను మేడికొండ ఆంజనేయులు చేతులు మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, ఉపాధ్యాయులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్‌గా అంజనారెడ్డి

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకుడు కాకా అంజనారెడ్డిని నరసరావుపేట అసెంబ్లీ కో–కన్వీనర్‌గా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను శుక్రవారం అందుకున్నట్లు అంజనారెడ్డి తెలిపారు. పార్టీ తన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

బుల్లెట్ వాహనం చోరీ

చిలకలూరిపేటటౌన్: ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ ఐదో లైన్‌కు చెందిన కంచర్ల అజయ్‌కుమార్ గ్యాస్ స్టౌవ్ టెక్నీషన్‌గా జీవనం కొనసాగిస్తుంటాడు. గత నెల 8వ తేదీ ఇంటి ముందు బుల్లెట్ వాహనం పార్క్ చేసి ఇంట్లో నిద్రిస్తుండగా బైక్‌కు చోరీకి గురైంది. ఈ విషయంపై శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్ సోపానాలు



మాదల(ముప్పాళ్ల): వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తుకు ఉపాధి సోపానాలు అని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ తెలిపారు. మండలంలోని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వృత్తి విద్యలో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థినులు వెర్నెట్ స్కిల్స్ ఆధ్వర్యంలో దూళిపాళ్ళలోని రాయని స్పిన్‌టెక్స్ మిల్లుకు ఇండస్ట్రియల్ విజిట్ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మిల్లులో దారం తయారీ, మిషనరీ గురించి నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిల్లు జనరల్ మేనేజర్ వి.ఆనంద్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వృత్తివిద్యా టీచర్స్ వి.రామాంజనేయులు, కేడీఎల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగేంద్రహారాయ త్రిలోచనాయ...



నాదెండ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



పాతూరు శివాలయంలోని పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

వినుకొండ టౌన్ , నరసరావుపేట ఈస్ట్ : నాగుల చవితిని పురస్కరించుకొని వినుకొండలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళామణులు తెల్లవారుజామునే తమ సమీపంలోని పుట్టల వద్దకు చేరుకొని, పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోశారు. ఈ సందర్భంగా అక్కడి నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే నరసరావుపేట పాతూరు శివాలయంలోని నాగేంద్రుని పుట్ట వద్ద ఉదయం మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయాన్నే మహిళలు పుట్ట వద్దకు చేరుకొని పాలు, నానబెట్టిన సజ్జలు, చలిమిడి, అరటి పళ్లు పుట్ట వద్ద సమర్పించారు.

నాదెండ్ల మండలంలో......

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో సచివాలయం సమీపంలోని శివనాగేంద్రస్వామి ఆలయ 38వ వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాగుల చవితి పర్వదినం వైభవంగా జరిగింది. కార్తీక మాసం స్వాతికార్తెలో నాగుల చవితి విశిష్ట పర్వదినంగా భావిస్తారు. భక్తులు ఉదయం 5 గంటల నుంచే వార్లు పోయుట, పూజా కార్యక్రమాలు, దీపాలు వెలిగించుట నిర్వహించారు. అనంతరం గణపవరం లలితాసమాజం వారిచే లలిత పారాయణం నిర్వహించారు. బోయపాలెం ప్రసన్నాంజనేస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు పరాంకుశం హనుమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తీర్థప్రసాదాల వినియోగం అనంతరం సాయంత్రం 4 గంటలకు





రొంపిచర్ల శివాలయంలోని నాగ్రేందుని పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం సందడిగా మారింది.

తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ భక్తుల తాకిడి ఏర్పడింది. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు చేసి ఆవు పాలు, వార్లు పోసేందుకు వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. రాత్రి బొప్పూడి పోలేరమ్మతల్లి భజన సమాజం, గణపవరం నాగరాజ భజన సమాజం వారిచే భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోట నాగపూర్ణచంద్రరావు, పసుమర్తి మధుబాబు, గుంటుపల్లి శ్రీనివాసరావు, అన్నా వెంకటసత్యనారాయణ దంపతులు అందించిన ఆర్థిక సాయంతో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

రొంపిచర్ల మండలంలో....

రొంపిచర్ల: మండల ప్రజలు శుక్రవారం నాగుల చవితి పర్వదినాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ఉన్న నాగేంద్రుని పుట్టలను ఉదయం నీళ్లతో శుభ్రపరిచారు. అనంతరం



తిమ్మాయపాలెం రోడ్డులోని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మహిళా భక్తులు ఉపవాసాలతో నాగేద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించి చలిబిండి, నానుబ్రాలను ఆవు పాలతో నివేదన చేశారు. రొంపిచర్ల, సంతగుడిపాడు, విప్పర్ల, వడ్లమూడివారిపాలెం, పరగటిచర్ల, మాచవరం, కొత్తపల్లి తదితర శివాలయాల్లోని నాగేంద్రుని పుట్టలవద్ద ఎక్కువ మంది భక్తులు పూజలు నిర్వహించారు. నాగ్రేందునికి పూజలు నిర్వహించటం వల్ల కన్నెల మనోసిద్ధి ప్రాప్తిస్తుందని నమ్మకం.

ఎన్నికల ప్రక్రియే ప్రథమ కర్తవ్యం

- చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతబాబు
- యడ్లపాడు సచివాలయంలో బీఎల్‌వోలతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతబాబు

యడ్లపాడు: ఎన్నికల ప్రక్రియ ప్రథమ బాధ్యతగా భావించి..క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.వసంతబాబు బీఎల్‌ఓలకు చెప్పారు. యడ్లపాడు గ్రామ సచివాలయం–1లో శుక్రవారం ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు జీరో డోర్ నెంబర్, జంక్ క్యారెక్టర్‌లు ఉన్న డోర్ నెంబర్లు, అలాగే ఒకే డోరునంబర్‌లో 10కంటే ఎక్కువ ఓట్లు కలిగిన ఇళ్లను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. అలాగే మృతి చెందిన వారి ఓట్ల తొలగింపుల్ని పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. జాతీయ ఓటర్ల జాబితా పరిశీలకులు శ్రీధర్ ఐఏఓఎస్‌ను ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎన్నికల పరిశీలన అధికారి బి శ్రీధర్ క్షేత్రస్థాయి ఆకస్మిక తనిఖీలకు రానున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఎన్నికలకు సంబంధించిన పూర్తి సమాచారం తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఓటర్ల ఫోటోలు, ప్రాథమిక నమోదు, తదితర వాటిని సకాలంలో విచారణ చేసి తుది నివేదికల్ని త్వరితగతిన సహాయ ఓటర్ల నమోదు అధికారి కార్యాలయానికి అందించాలన్నారు. అదే విధంగా ముసాయిదా జాబితాలో ఏమైనా పొరపాట్లు గుర్తిస్తే వెంటనే వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఆర్వో వైవీబీ కుటుంబరావు, సూపర్‌వైజర్లు చక్రవర్తి, మోజేస్, 57 మంది బీఎల్‌వోలు హాజరయ్యారు.

వైభవంగా అక్షింతల కలశం ఊరేగింపు



అంక్షితలను పట్టణంలో ఊరేగిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): అయోధ్యలో జనవరిలో జరగనున్న శ్రీరామచంద్రుని దేవాలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని పవిత్ర అక్షింతలు దేశంలోని అన్ని ప్రాంతాల భక్తులకు అందేవిధంగా శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో శుక్రవారం వినుకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా పవిత్ర అక్షింతలతో కూడిన కలశాన్ని మంగళవాయిద్యాలతో ఊగిరేంపుగా శ్రీరాముని భజనలతో పట్టణంలోని రంగనాయకస్వామి దేవస్థానం నుంచి మెయిన్ బజారు, బోసుబొమ్మ సెంటర్, కోదండ రామాలయం, శివయ్యస్థూపం సెంటర్ మీదుగా కొత్తపేట శ్రీ పట్టాభి రామాలయంకు చేర్చడం జరిగింది. ఆ పవిత్ర అక్షింతలను వివిధ గ్రామాలు, పట్టణాల్లోని భక్తులకు ప్రతి ఇంటికి స్వామి వారి ఆశీస్సులు అందాలని పంపడం జరుగుతుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, హిందూ బంధువులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు జె.రాజేశ్వరి, కె. సుబ్బారావు, ఎం. కృష్ణాంజనేయులు, గట్టుపల్లి కాశీ, గజవల్లి నాగపవన్, మల్లికార్జున, జి. బాలరావు, ప్రకాష్, నాగాచారి, ప్రసాద్, భద్రయ్య, సుబ్బారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కారుమంచిలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు



కారుమంచి మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ ప్రమీల

శావల్యాపురం:మండలంలోని కారుమంచి ప్రభుత్వ మద్యం దుకాణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈనెల 15వ తేదీన షాపులో అమ్మిన మద్యం సీసాలు సంబంధించిన చలానా ఈనెల16వ తేదీ మధ్యాహ్నానికి చెల్లించపోవటంతో అనుమానం వచ్చి మద్యం దుకాణాన్ని తనిఖీ చేయించినట్లు ఎక్సైజ్ సీఐ మున్నంగి ప్రమీల వెల్లడించారు. అయితే సూపర్‌వైజరు లేకపోవటంతో పాటు మద్యం సీసాల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించామనీ, దుకాణంలో 32,150 సీసాలు ఉండాల్సి ఉండగా 28 వేల 650 సీసాలు మాత్రమే ఉన్నట్లు తనిఖీల్లో నిర్ధారణ అయిందన్నారు. మిగిలిన సీసాలను బార్ కోడ్ లేకుండా అక్రమంగా అమ్మినట్లు గుర్తించామని వీటి విలువ రూ. 5 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. అయితే సూపర్‌వైజరు కుటుంబ సభ్యులు కొంతమేర జమ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీలు చేసిన వారిలో ఎక్సైజ్ ఎస్ఐ రంగిశెట్టి పూర్ణచంద్రరావు, సిబ్బంది మల్లావరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

26న యూటీఎఫ్ పల్నాడు జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పల్నాడు జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 26వ తేదీన గురజాల చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు, ఆర్. అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం. పోలయ్య, జి.నాగరాజు, ఐదు మండలాల నాయకులు బి.భాస్కరరావు, వి.నాగేశ్వరరావు, డి.రవికుమార్, పి.రమేష్‌బాబు, పీఏ జిలానీ, బి.రామునాయక్, డి.మస్తాన్, సీహెచ్. మల్లికార్జున, డి.కోటేశ్వరరావు, ఐ.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కొత్త రామకృష్ణ, డాక్టర్ గీతాంజలి

సత్తెనపల్లి: చిన్నపిల్లల్లో న్యుమోనియా లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించటం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు అని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో న్యుమోనియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిన్నపిల్లలు న్యుమోనియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పిల్లల వార్డులో, ప్రసూతి విభాగాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల అందరికి అవగాహన ఏర్పడి జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి గీతాంజలి మాట్లాడుతూ ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ హాస్పిటల్‌లో చిన్న పిల్లలు, గర్భిణులకు అవగాహన కల్పించడం వల్ల వ్యాధిని ఆదిలోనే అరికట్టవచ్చన్నారు. హాస్పిటల్ మొత్తం తిరిగి చూసి హాస్పిటల్ ఎంతో అభివృద్ధి చెందిందని పారిశుద్ధ్య నిర్వహణ కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి, పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగపద్మజ, డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్ సుజాత, పిల్లల డాక్టర్ ప్రేమ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ, సిబ్బంది ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో స్ఫటిక శివలింగానికి గ్రామోత్సవం

రెంటచింతల: సత్రశాల వద్ద పవిత్ర కృష్ణానది తీరాన వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలోని అభిషేక మండపంలో పవిత్రమైన స్ఫటిక లింగాన్ని ఈ కార్తీకమాసంలో ఏర్పాటు చేయనున్నట్లు సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూ.2.80 లక్షల వ్యయంతో ఈ స్ఫటిక లింగం తయారు చేయించి రెంటచింతల గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక పౌర్ణమి రోజు భక్తులను స్ఫటిక శివలింగం దర్శనం చేసుకోవడానికి అనుమతించడం జరుగుతందన్నారు.

గ్రంథాలయాలతోనే జ్ఞాన సముపార్జన



ముప్పాళ్లలో గ్రంథాలయ వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



వినుకొండలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, కవులు

- ప్రధానోపాధ్యాయురాలు కె. విజయకుమారి
- వేర్వేరు గ్రామాల్లో గ్రంథాలయ వారోత్సవాలు

రొంపిచర్ల: మేధావులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకున్నారని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. విజయకుమారి అన్నారు. మండలంలోని సంతగుడిపాడు గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుండే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చు అన్నారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహించారు. రచయిత అక్కుల సుబ్బారావును సన్మానించారు. ఉపాధ్యాయుడు ఎం. రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల హెచ్ఎం బాలశౌరీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూరీబా స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రొంపిచర్ల శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాల వారోత్సవాల ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయ అధికారులు కె. వెంకట్రావు, జి. సుబ్బారావులు తెలిపారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులోని శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయిత సందేశాలు, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపూరు ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.సైమన్ పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల జరిగే దుష్ఫలితాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు చెస్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి. శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల శాఖా గ్రంథాలయంలో....

మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి జెడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం వి.సాంబనాయక్ పాల్గొని పుస్తక పఠనం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. అనంతరం గ్రామంలో గ్రంథాలయ ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.నాగలక్ష్మి, పీఈటీ వి.చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు తెలుగు భాష గురించి వివరిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు



ఈపూరులో చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఈబీ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.సైమన్

పఠనాసక్తి అలవాటు చేయాలి

చిలకలూరిపేటటౌన్: పిల్లలో చిన్నతనం నుంచి పఠనాసక్తిని కలిగించే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని ప్రముఖ న్యాయవాది నక్కా కోటేశ్వరమ్మ చెప్పారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రావికింది మణికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా నక్కా కోటేశ్వరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల నైతిక విలువలు పెంపొందుతాయని, వ్యక్తిత్వ వికాసం అలవడుతుందని చెప్పారు. ముందుగా గ్రంథాలయ ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు పోలిశెట్టి నాగేశ్వరరావు, సభ్యులు ఏ దేవేంద్ర రాజేష్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు ఆర్ లీలాకీర్తన, ఈదర గోపీచంద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పీవీ సుబ్బారావు, సభ్యులు దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి నాగుల్ మీరావలి పాల్గొన్నారు.

దేశభాషలందు తెలుగు లెస్స

బొల్లాపల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తెలుగు భాషా ప్రాముఖ్యత, ప్రాధాన్యత గురించి శుక్రవారం గ్రంథాలయాల్లో విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హఫీజున్నీసా, ఉపాధ్యాయురాలు కృష్ణకుమారిలు శాఖా గ్రంథాలయ అధికారి ఆర్.సేవానాయక్‌లు తెలుగు భాష గొప్పదనం, ఔన్నత్యాన్ని గురించి తెలిపారు. దేశభాషలందు తెలుగు లెస్సా, విజయనగర పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు హయాంలో తెలుగు భాష వర్ధిల్లిందని, తెలుగులో ఉన్న తియ్యదనాన్ని గురించి విద్యార్థులకు చెప్పారు. విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. సాంకేతిక విజ్ఞానం -కృత్రిమ మేధ అనే అంశంపై వక్తృత్వం, డిజిటల్ లైబ్రరీల ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న న్యాయవాది నక్కా కోటేశ్వరమ్మ



వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థిని



రచయితను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు కె. విజయకుమారి, బాలశౌరీలు

పోటీలు జరిగాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, పి.వి.హనుమంతరావు వ్యవహరించారు. కాగా, 18వ తేదీ శనివారం 6, 7తరగతుల విద్యార్థులకు పద్యాల పోటీ, 3, 4, 5తరగతుల వారికి మ్యూజికల్ ఛైర్ పోటీ నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ తెలిపారు.


వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వినుకొండ శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలను నిర్వహించారు. అలాగే పుస్తక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు, రచయిత కమలారామ్, జాషువా సమాఖ్య కోశాధికారి రవికుమార్‌లు పాల్గొన్ని మాట్లాడుతూ రచనల గురించి, గ్రంథాలయ ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భూక్యా బద్రీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ యాప్ రిజిస్ట్రేషన్

బొల్లాపల్లి : జిల్లా ఎస్పీ ఆదేశానుసారం దిశ యాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. బండ్లమోటు ఎస్సై డి. చెన్నకేశవులు ఆధ్వర్యంలో మండలంలోని బొల్లాపల్లి, మేళ్ళవాగు కూడలిలో పోలీస్ సిబ్బంది దిశయాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. మహిళల భద్రత, రక్షణ కోసం దిశ యాప్ రిజిస్ట్రేషన్ ఉపయోగకరమని ఎస్సై తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి బాల్యవివాహాలపై అవగాహన గురించి మాట్లాడుతూ అమ్మాయికి వివాహం వయసు 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, తల్లిదండ్రులు ఆడపిల్లల రక్షణాభివృద్ధికై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.